
రాష్ట్ర కమిటీలో చోటు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ యూనియన్ సీఐటీయూ అనుబంధ రాష్ట్ర సంఘంలో జిల్లాకు చెందిన రాష్ట్ర కార్యదర్శిగా పెర్క శ్రీకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జాడే మహేశ్వర్‌లు ఎన్నికయ్యారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో ఏపీఆర్ ఫంక్షన్ హాల్ జరిగిన రాష్ట్ర ఐదో మహాసభలో వారిని ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దు చేయాలి

సిర్పూర్(టి), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలంలోని చింతకుంట పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు శనివారం ఎంఆర్సీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు బొమ్మెన శ్రీనివాస్ మాట్లాడుతూ ఇక్కడి పాఠశాల ఉపాధ్యాయుడిని కాగజ్‌నగర్‌కు డిప్యూటేషన్‌పై పంపించడం ఎంత వరకు సమంజసమని, డిప్యూటేషన్ ఇస్తే ఇక్కడి విద్యార్థుల భవిష్యత్ నాశనమవుతుందని, వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ విషయంపై ఎం ఈవో వేణుగోపాల్‌రావును వివరణ కోరగా జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఉపాధ్యాయుడిని కాగజ్‌నగర్ పట్టణానికి డిప్యూటేషన్‌పై పంపించామని తెలిపారు.

పెద్దపులి అలజడి



- ఇటీవల రెండు చోట్ల పశువులపై దాడి
- అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు
- పులి పాదముద్రల గుర్తింపు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

ఆసిఫాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా అడవుల్లో మళ్లీ పెద్ద పులి గర్జిస్తోంది. దీంతో పల్లెల్లో భయాందోళన మొదలైంది. నవంబరు నుంచి జనవరి వరకు పులులు జతకట్టే సమయం. ఆ సమయంలో వాటి సంచారం ఎక్కువగా ఉంటుంది. ఈసారి మాత్రం అక్టోబరులోనే పులుల సంచారం కనిపిస్తోంది. వారం వ్యవధిలోనే రెండు చోట్ల పశువులపై దాడులు చేశాయి. అటవీ శాఖ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అటవీ సమీప గ్రామాల్లో డప్పు చాటింపుల ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. జిల్లాలో సాధారణంగా ఏటా నవంబరు నుంచి జనవరి వరకు పులి సంచారం ఎక్కువగా ఉంటుంది. పులులు జతకట్టే సమయం కావడంతో మహారాష్ట్ర నుంచి పులుల రాకపోకలు పెరుగుతుంటాయి.

జిల్లాలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటాయి. గతంలో ఇదే సీజన్‌లో పులులు దాడులు చేసిన ఘటనలు ఉన్నాయి. నాలుగైదు ఏళ్లుగా పశువులపై దాడులు పెరిగాయి. అదే సమయంలో పత్తి చేలల్లో పని చేస్తున్న వ్యవసాయ కూలీలపై కూడా పులులు దాడి చేశాయి. పులుల దాడిలో పలువురు మృతి చెందారు. గత ఏడాది నవంబరు 28న కాగజ్‌నగర్ మండలంలోని నజ్రూల్‌నగర్‌లో పత్తి ఏరుతున్న మోహర్లే లక్ష్మిపై పులి దాడి చేసి చంపింది. సిర్పూర్(టి) మండలంలోని దుబ్బగూడ గ్రామంలో పత్తి చేలలో పత్తి ఏరుతున్న రైతు సురేష్ పై దాడి చేసి గాయపరిచింది.

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో..

కాగజ్‌నగర్ డివిజన్‌లో ఇటీవల రెండు చోట్ల పశువులపై పులులు దాడులు చేశాయి. సిర్పూర్(టి) మండలం చీలపెల్లిలో అక్టోబరు 3న ఎల్ముల తిరుపతికి చెందిన లేగదూడపై పులి దాడి చేయడంతో మృత్యు వాత పడింది. అక్టోబరు 10న నవేగాం గ్రామంలో శివరాంకు చెందిన ఎద్దుపై పులిదాడి చేసి చంపేసింది. ఈనెల 13న దహెగాం మండలం బీబ్రా అటవీ ప్రాంతంలో పులి పాద ముద్రలను అధికారులు గుర్తించారు. పులుల సంచారంపై అటవీ సమీప గ్రామ ప్రజలు భయందోళనకు గురవుతున్నారు.

కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో పులుల సంచారం పెరిగిన నేపథ్యంలో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. పులి సంచారం ఏ ప్రాంతంలో ఉందన్న విషయాన్ని ట్రాక్ చేస్తున్నారు. పులి సంచారానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తు న్నారు. ఇదే సమయంలో పులి వల్ల మనుషులకు, పశువులకు ఎలాంటి హనీ జరుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. సిర్పూర్(టి) మండలం మాకిడి, చిలపల్లి, కాగజ్‌నగర్‌లోని పెద్దరాస్‌పల్లి, సార్‌సాల, అనుకొడ, దహెగాం మండలంలోని బీబ్రా, మురళీ గూడ తదితర ప్రాంతాల్లో డప్పు చాటింపులు చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ప్రస్తుతం రైతులు పత్తి ఏరే సమయం కావడంతో రైతులు వ్యవసాయ కూలీలు చేలలోకి వెళ్ల తప్పని పరిస్థితి. పులుల సంచారం కూడా పెరుగుతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పశువుల కాపరులు, రైతులు, వ్యవసాయ కూలీలు జాగ్రత్తగా ఉండాలని, అటవీ పరిసర ప్రాంత ప్రజలు రాత్రి వేళల్లో బయటకు రాకూడదని అధికారులు సూచిస్తున్నారు.

సదరం క్యాంపుల నిర్వహణకు చర్యలు

అదనపు కలెక్టర్ దీపక్ తివారి



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీపీఎం రామకృష్ణ

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దివ్యాంగ పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులకు పెన్షన్ పునరుద్ధరణకు ప్రత్యేక సదరం క్యాంపులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ వీసీ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్, గ్రామీణాభివృద్ధి అధికారులు, డీపీఎంలు, ప్రభుత్వ ఆసుపత్రుల పర్యవేక్షకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ పెన్షన్ పెనరుద్ధరణలో భాగంగా దివ్యాంగ పెన్షన్ పొందుతున్న వారిని అంగవైకల్యం నిర్ధారణ పరీక్షల కోసం ప్రత్యేక సదరం శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. పరీక్షలకు వచ్చే దివ్యాంగులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదా యంలో వీసీ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు దివ్యాంగుల పెన్షన్ పునరుద్ధరణ కోసం ప్రత్యేక సదరం శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. జిల్లాలో 60 మంది దివ్యాంగ పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులు పెన్షన్ పునరుద్ధరణకు జిల్లాలోని జైనూరు, కౌటాల మండ లాల్లో ప్రత్యేక అంగవైకల్యం నిర్ధారణ పరీక్షల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నిర్ధారణ పరీక్షలకు స్లాట్ బుకింగ్ కొరకు స్వయం సహాయక సంఘాల మహిళలు, వీఓఏలు, సీసీలు, ఏపీఎంలతో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న ప్రతి ఒక్కరూ సదరం శిబిరానికి హాజరయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సదరం శిబిరంలో దివ్యాంగు లతో పాటు వారికి సహాయకులుగా వచ్చే వారి కోసం సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటా మని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పంటలపై అడవి పందుల దాడులు



అడవి పందుల దాడిలో ధ్వంసమైన పంట

కెరమెరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో అడవి పందులు, కోతులు పంటలపై దాడి చేసి ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో అధికంగా అటవీ ప్రాంతం ఉండడం, అందులో వ్యవసాయ పంట భూముల్లో పత్తి, కందులు, కూరగాయల పంటలు రైతులు సాగు చేస్తున్నారు. పంటలు సాగు అయ్యే కరమంలో రైతులకు ప్రతినిత్యం కేలి(బి), కేలి(కె), నిషాని, ఇందాపూర్, దేవుడపల్లి, అనార్‌పల్లి, తుమ్మగూడ, జోడేఘాట్, బాబేఝరి, నాగల్ గొంది తదితర గ్రామాల్లో అడవి పందులు చేతికొచ్చిన పంటను ధ్వంసం చేస్తున్నాయి. కెరమెరి అటవీ రేంజ్ పరిధిలో సుమారు 54 వేల ఎకరాల్లో అటవీ భూములకు అధికారులు పట్టాలు ఇచ్చారు. 54 వేల ఎకరాలు కెరమెరి, జైనూరు, సిర్పూర్(యూ) మండలాల వ్యాప్తంగా ఉంది. అధికారులు పందులను, కోతులను కట్టడి చేయాలని రైతులు కోరుతున్నారు.

లక్కు.. కిక్కు.. ఎవరికో..?

- రేపు మద్యం దుకాణాల టెండర్ల డ్రా
- జిల్లాలో 32 దుకాణాలకు 680 దరఖాస్తులు



టెండర్లు స్వీకరిస్తున్న జిల్లా ఎక్సైజ్ అధికారి(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఉత్కంఠ నెలకొంది. కిక్కు, లక్కు తమను వరిస్తుందా లేదా అని సోమవారం తీసే లాటరీపై గంపెడాశలతో ఎదురుచూస్తున్నారు. దరఖాస్తుల స్వీకరణ ముగియడంతో టెండర్ దారుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈసారి లక్ష్మి కటాక్షం ఎవరిని వరించబోతుందోనన్న ఆసక్తి ప్రతి ఒక్కరిలో కనిపిస్తోంది. కొత్తగా టెండర్ వేసిన వారు మొదటి అవకాశంపై ఆశలు పెట్టుకుంటున్నారు. డ్రాను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎక్సైజ్‌శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో ఎక్సైజ్‌శాఖ అంచనాలు తలకిందులయ్యాయి. గత సీజన్‌లో భారీ పోటీ, అధిక దరఖాస్తులతో జిల్లాలో టెండర్లు రికార్డు స్థాయిలో నమోద య్యాయి. 32 మద్యం దుకాణాలకు 1,020 దరఖాస్తులు, రూ. 2 లక్షల(నాన్ రీఫండబుల్ ఫండ్) ద్వారా సుమారు రూ. 20 కోట్ల మేర ఆదాయం సమకూరింది. అయితే ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. దరఖాస్తు ఫీజు రూ. 3 లక్షలకు పెంచడంతో టెండర్ దారులు నిరాశకు గురయ్యారు. దీంతో జిల్లాలోని 32 మద్యం దుకాణాలకు 680 టెండర్లు దాఖలయ్యాయి.

రూ. 3లక్షల డిపాజిట్..

టెండర్ల ప్రక్రియలో పాల్గొనే వ్యాపారులు ప్రతీ దరఖాస్తుకు రూ. 3 లక్షల నాన్ రీఫండబుల్ డిపాజిట్ చెల్లించాలి. లక్కు తగలకపోతే ఆ మొత్తం తిరిగి రాదు. ఈ కారణంగా చాలా మంది కొత్తగా వ్యాపారం ప్రారంభించాలనుకున్న వారు వెనుకడుగు వేశారు. గతంలో పదుల సంఖ్యలో దరఖాస్తులు వేసి లక్కు తగలకపోయినా అనుభవం ఉన్న వ్యాపారులు ఈసారి దూరంగా ఉన్నారు. అలాగే రెండేళ్లుగా మద్యం అమ్మకాలపై కట్టుదిట్టమైన నియంత్రణలు, ధరల పెరుగుదల, కొత్త లైసెన్సింగ్ నిబంధనలు వ్యాపార లాభాలను తగ్గించాయి. ఇక సేల్స్ తగ్గిపోవడంతో లాభదాయకతపై అనుమానాలు పెరిగాయి. మునుపటి సీజన్‌లా విక్రయాలు జరుగవని ముందుగానే అంచనా వేసి చాలా మంది ఈసారి దరఖాస్తు చేయలేదని వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలోని 32 మద్యం దుకాణాలకు 680 దరఖాస్తులు వచ్చాయి. ఆసిఫాబాద్ డివిజన్‌లోని 16 మద్యం దుకాలణాలకు 349, కాగజ్‌నగర్ డివిజన్‌లోని 16 మద్యం దుకాణాలకు 331 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా కాగజ్‌నగర్ డివిజన్‌లోని గూడెం షాప్‌కు 67 దరఖాస్తులు రాగ, అత్యల్పంగా ఆసిఫాబాద్ డివిజన్‌లోని గోలేటి షాప్‌కు మూడు దరఖాస్తులు వచ్చాయి. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మద్యం దుకాణాలకు లక్కీ డ్రా నిర్వహించనున్నారు. డిసెంబరు 1 నుంచి కొత్త మద్యం పాలసీ అమలులోకి రానుంది. జిల్లా పరిధిలో 32 మద్యం దుకాణాలకు ఈ నెల 27న లక్కీడ్రా ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 26 నుంచి ఈ నెల 23 వరకు 32 దుకాణాలకు గాను మొత్తం 680 దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. లక్కీడ్రాను కార్యాలయం సముదాయంలో నిఇర్వహించడం జరుగుతుందని టెండరు దారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

గెర్రె ఘటనపై ముఖ్యమంత్రి స్పందించాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ఆసిఫాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దహెగాం మండలం గెర్రె గ్రామంలో గర్భిణి శ్రావణిపై జరిగిన కుల దురాహంకార హత్యపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జానవెస్లీ డిమాండ్ చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం జిల్లా పార్టీ కారాయలయంలో జిల్లా కార్యదర్శి రాజన్న అధ్యక్షతన రాష్ట్ర కార్యదర్శి బండారి రవికుమార్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అటవిక సంఘటన జరిగినప్పటికీ కలెక్టర్, ఎస్పీ స్పందించక పోవడం సరికాదన్నారు. శ్రావణిని శేఖర్ కుటుంబ సభ్యులు పథకం ప్రకారం హత్య చేశారని చెప్పారు. శేఖర్‌తో పాటు అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి వెంటనే వారిని అరెస్టు చేయాలన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతో పాటు ఐదు ఎకరాల భూమి, రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. శేఖర్ అక్రమంగా ఆక్రమించుకున్న ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని బాధిత కుటుంబానికి అందించాలన్నారు. జిల్లాలో జరిగిన దారుణమైన సంఘటన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లడంతో పాటు డీజీపీ దృష్టికి కూడా తీసుకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దినకర్, కార్తీక్, మాలాశ్రీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): శ్రావణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. మండలంలోని గెర్రె గ్రామంలో శనివారం ఇటీవల హత్యకు గురైన గర్భిణి శ్రావణి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్కువ కులం అమ్మాయిని పెళ్లి చేసుకు న్నాడని తండ్రి సత్తయ్య కక్ష పెంచుకుని నిండు గర్భిణి శ్రావణిని హత్య చేశారన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట నాయకులు రవికుమార్, భూపాల్, సచిన్, రాజన్న, ఆనం ద్‌కుమార్, అశోక్, మాలాశ్రీ, కార్తీక్, దినకర్, శంకర్, బక్కన్న తదితరులు ఉన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కాగజ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మూడో మహాసభల సందర్భంగా కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మహాసభ జిల్లా అధ్యక్షురాలు స్వరూప, పద్మ, రజిని, రమా, లక్ష్మి, నవీన, ఓమల, సునిత, శోభ, శకుంతల పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో ఓపెన్‌హౌస్

కెరమెరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం కెరమెరి పోలీసు స్టేషన్‌లో ఎస్సై మధుకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. విధులు, కేసు దర్యాప్తు విధానాలు, సామాజిక భద్రత చర్యల గురించి వివరించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ పోలీసులు ప్రజల భద్రత కోసం అంకిత భావంతో పని చేస్తున్నారని చెప్పారు. ప్రజల సహకారంతోనే నేరాలు తగ్గుతాయని తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



మాట్లాడుతున్న సింగరేణి కాలరీస్ ఎడ్యూకేషన్ సొసైటీ కార్యదర్శి వెంకటాచారి

రెబ్బెన, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని సింగరేణి కాలరీస్ ఎడ్యూకేషన్ సొసైటీ కార్యదర్శి వెంకటాచారి అన్నారు. రెబ్బెన మండలం గోలేటిలోని సింగరేణి హైస్కూల్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు, వసతులు, వార్షిక ఫలితాల వివ రాలను తెలుసుకున్నారు. విద్యార్థులను స్టేజిపై భయం లేకుండా మాట్లాడేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థి దశలో 7, 8,9, 10 తరగతుల విద్యా ప్రధానమని అన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి మాత్రమే కాకుండా ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంతకు ముందు జీఎం కార్యాలయంలో ఇన్‌చార్జి జీఎం నరేందర్ అధికారులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజమల్లు, డీజీఎం మదీనాభాషా, కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు రవితేజ, ఉపాధ్యాయులు అర్జరెడ్డి, పీడీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



బీఆర్ఎస్ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ కెరమెరి మండల అధ్యక్షుడు అంబాజీ ఆధ్వర్యంలో అనారపల్లి, తుమ్మగూడ, సోమ్లగూడ, కోలాంగూడ గ్రామాలకు చెందిన 200 మంది ఎమ్మెల్యే కోవ లక్ష్మి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సరస్వతి, యూనిస్, పరుశురాం, కృష్ణ, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

మద్య నిషేధానికి గ్రామస్థుల ప్రతిజ్ఞ

దహెగాం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాంపూర్‌లో సంపూర్ణ మద్యపాన నిషేధం కోసం శనివారం గ్రామస్థులు తీర్మానించి ప్రతిజ్ఞ చేశారు. పాటించని వారికి జరిమానా విధించాలని నిర్ణయించారు.

పలు చోట్ల వర్షం.. నేలవాలిన వరి



బెజ్జూరులో నేలవాలిన వరి పంట

బెజ్జూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు చోట్ల వర్షం కురిసింది. వర్షానికి కోతకు వచ్చిన వరి నేలవాలిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. బెజ్జూరు మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పలు చోట్ల వరి పంట నేలవాలింది. ముఖ్యంగా వరి పంట కోతల సమయంలో కురిసిన వర్షంతో వరి పూర్తిగా నీటిలో మునిగిపోయింది. ఇప్పటికే అతివృష్టి కారణంగా పంటలు చేతికొచ్చే సమయంలో ఏకదాటిగా కురుస్తున్న వర్షాలకు పత్తి, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా కురిసిన వర్షానికి మరింత నష్టం సంభవించేలా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంట సాగు కోసం వేల రూపాయల ఖర్చు చేసినా కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితిలో ఉండగా అకాల వర్షం కారణంగా మరింత నష్టం కలిగేలా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రైతు లకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాల్లో కోసిన వరి వర్షంతో పూర్తిగా తడిసి ముద్దయిందని వాపోతున్నారు. పత్తి పంటకు సైతం వర్షం నష్టం కలిగిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న సివిల్ జడ్జి అజయ్ ఉల్లం

సిర్పూర్(టి), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిర్పూర్(టి) జూనియర్ సివిల్ జడ్జి అజయ్ ఉల్లం అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిని పరిశీలించి భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. భోజనం రుచిగా ఉండేలా చూడాన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఏసీబీకి చిక్కిన జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్

రూ. 2 లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టివేత


జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ రాథోడ్ బిక్కు

మంచిర్యాల క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ రాథోడ్ బిక్కు రెండు లక్షల రూపాయలు లంచం తీసు కుంటుండగా ఏసీబీ అధికారులు శనివారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ మధు తెలిపిన వివరాల ప్రకారం.. రాథోడ్ బిక్కుకు మరంభీం ఆసిఫాబాద్ జిల్లా సహకార సంఘాల ఇన్‌చార్జి మేనేజర్‌గా సైతం విధులు నిర్వహిస్తున్నాడు. కుమరంభీం జిల్లాలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి గత సంవత్సరం నవంబరులో సస్పెండ్ అయ్యాడు. ఉద్యోగికి సంబంధించిన పెరిగిన వేతనాల మంజూరు, సస్పెన్షన్ ఎత్తివేత విషయంలో రాథోడ్ బిక్కు తీవ్రఇబ్బందులకు గురిచేశాడు. అతడి నుంచి ఏడు లక్షల రూపాయలు డిమాండ్ చేశాడు. అతడు రెండు లక్షల రూపాయలు ఇచ్చేందుకు అంగీకరించి ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారి సూచన మేరకు శనివారం మంచిర్యాలలో రాథోడ్ బిక్కు అద్దెకుంటున్న ఇంట్లో ఆ ఉద్యోగి రెండు లక్షల రూపాయలు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సస్పెండ్ ఎత్తివేసి ఉద్యోగంలోకి తీసుకోవడం, జీవో 44 ప్రకారం వేతనాలు సవరణలు చేయడం, 2023 ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించడం, సస్పెన్షన్ కాలానికి సంబంధించిన జీతభత్యాలను మంజూరు చేయడంతో పాటు విచారణ నివేదికపై చర్యలు తీసుకోకుండా ఉం డేందుకు లంచం అడిగి రెండు లక్షల రూపాయలతో పట్టుబ డ్డాడన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కరీంనగర్ ప్రత్యేక న్యాయ మూర్తి ఎదుట హాజరుపర్చినట్లు డీఎస్పీ తెలిపారు. లంచం అడిగి తే ప్రజలు నిర్భయంగా ఏసీబీ టోల్ ఫ్రీ నం. 1064కు లేదా వాట్సా ప్ నంబర్ 9440446106 లేదా ట్విట్టర్ ద్వారా సమాచారం అందించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే అధికారి సెల్ 9154388963 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం


మాట్లాడుతున్న డీఎస్పీ వహిదుద్దీన్

కాగజ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డీఎస్పీ వహిదుద్దీన్ అన్నారు. మండలంలోని తుంగమడుగులో శనివారం కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అలాగే సైబర్ నేరాల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్‌నేరగాళ్లు బ్యాంకు వివరాలు అడిగితే చెప్పవద్దని తెలిపారు. అలాగే గుడుంబా దందాను ఎవరు కూడా చేయవద్దని సూచించారు. ఈ సందర్భంగా ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. 20 లీటర్ల గుడుంబా, 20 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా దందా నిర్వహిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో సీఐ కుమార స్వామి, ఎస్సై కళ్యాణ్ పాల్గొన్నారు.

రెబ్బెనలో కొవ్వొతుల ర్యాలీ


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, నాయకులు

రెబ్బెన, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని రెబ్బెనలో శనివారం రాత్రి కొవ్వొతుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోలీసులు ప్రజల రక్షణ కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్ డిపో ఏర్పాటయ్యేనా..?

- దశాబ్దాలు గడుస్తున్నా ఆచరణకు నోచుకోని హామీ
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


కాగజ్‌నగర్ బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో బస్ డిపో ఏర్పాటుకు ముందడుగు పడడం లేదు. జనాభాకు తగ్గట్టుగా రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులకు దశాబ్దాలుగా ఇబ్బందులు తప్పడం లేదు. కాగజ్‌నగర్‌లో బస్ డిపోకు 30 సంవత్సరాల క్రితమే భూమి కేటాయిం చారు. కానీ నిర్మాణానికి అడుగులు పడడం లేదు. దీంతో బస్ డిపోకు కేటాయిచిన ఆ భూములు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. కాగజ్‌నగర్‌లో బస్ డిపో కోసం గతంలోనే బస్సు స్టేషన్ పక్కన స్థలం కేటాయించారు. కానీ నేటికి కూడా బస్ డిపో ఏర్పాటు కోసం నిధులు కానీ కార్యాచరణ కానీ ముందుకు సాగడం లేదు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాలకు నేటికి కూడా బస్ సౌకర్యం లేకపోవడంతో ఆశించిన అభివృద్ధి జరగడం లేదు. ఇంకా ఆర్టీసీ బస్సు సేవలు లేని గ్రామాలు జిల్లాలో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.

జిల్లా వ్యాప్తంగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బస్ డిపో ఉన్నప్పటికీ కాగజ్‌నగర్ డివి జన్‌లో ఉన్న ఏడు మండలాలైన సిర్పూర్(టి). బెజ్జూ రు, కౌటాల, చింతలమానెపల్లి, దహెగాం, పెంచికల్ పేటతో పాటు కాగజ్‌నగర్ మండలాల్లోని అనేక మారు మూల ప్రాంతాలకు నేటికి బస్సు సౌకర్యం లేదు. వీటిలో అటవీ గిరిజన గ్రామాలు ఎన్నో ఉన్నాయి. ఆర్టీసీ బస్సు సౌకర్యం కాదుకదా కనీసం బస్సు షెల్టర్స్, బస్సు స్టేషన్‌ల నిర్మాణం కూడా కొన్ని మండల కేంద్రాల్లో జరగలేదు. దశాబ్దాలుగా ఒక్క కౌటాల మినహా సిర్పూర్ (టి), బెజ్జూరు, దహెగాంలతో పాటు కొత్త మండలాల్లో బస్సు స్టేషన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉంది.

కానీ గత ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలున్నాయి. ఇందుకు గత పాల కుల నిర్లక్ష్యమే కారణమని భావిస్తున్నారు. గత మూడు నెలల క్రితం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు కూడా అసెంబ్లీలో కాగజ్ నగర్‌కు బస్ డిపో ఏర్పాటు చేయాలని, దీంతో సిర్పూరు నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు రవాణా వ్యవస్థ మరింత మెరుగు పరిచేందుకు అవకాశాలున్నాయని ప్రస్తావించారు. దీంతో కాగజ్‌నగర్ డిపో తెరమీదకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా బస్ డిపో కోసం అడుగులు వేస్తుండడంపై కొత్తగా ఆశలు చిగురిస్తున్నాయి.

ఏడు మండలాలకు..



కాగజ్‌నగర్‌లో డిపో ఏర్పాటు చేస్తే సిర్పూరు నియోజకవర్గంలోని కాగజ్‌నగర్, సిర్పూరు(టి), బెజ్జూరు, కౌటాల, చింతలమానేపల్లి, దహెగాం, పెంచిక లపేట మండలాలకు చెందిన గ్రామీణ ప్రాంతాలకు రవాణా వ్యవస్థ ఉంది. ఈ మండలాల్లో గిరి గ్రామాలున్నాయి. నిత్యం వివిధ అవసరాల కోసం కాగజ్‌నగర్‌కు వస్తుం టారు. బస్సులు సకాలంలో రాక పోవడంతో వీరంతా ఆటోలు, జీపుల్లో ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. కాగజ్‌నగర్ డిపో ఏర్పాటు చేస్తే ఈ గ్రామాలకు నేరుగా బస్సులను పంపించేందుకు అవకాశాలున్నాయి.

ప్రస్తుతం ఆసిఫాబాద్ డిపో నుంచి కాగజ్‌నగర్ బస్టాండుకు బస్సులు రావాల్సి ఉంటుంది. కాగజ్‌నగర్‌కు వచ్చిన తర్వాత ఇక్కడి నుంచి బస్సుల ను వివిధ రూట్లలో ఆయా గ్రామాలకు పంపించాల్సిన పరిస్థితి ఉంది. కాగజ్‌నగర్ బస్ డిపో ఏర్పాటు చేస్తే అన్ని మండలాలకు బస్సు సౌకర్యం కల్పించే అవకాశం ఉంటుంది. జిల్లా సరిహద్దున ఉన్న మహారాష్ట్రకు కూడా సిర్పూరు(టి), చింతల మానెపల్లి, కౌటాల, బెజ్జూరు మండలాల మీదుగా బస్సులు రాకపోకలు సాగించే అవకాశం ఉంటుంది. బస్ డిపో స్థలం ఆక్రమణకు గురవుతుండడంతో గతంలో అధికారులు సర్వే చేపట్టారు. రెవెన్యూ అధికారులను కూడా సంప్రదించి హద్దులు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కొంతమేర కబ్జాకు గురవుతుందనే ఆరోపణలున్నాయి. కాగజ్‌నగర్ నుం చి ఆయా మండలాలకు వార సంతలకు వెళ్లే వ్యాపారులు బస్సు సౌకర్య కల్పిస్తే బాగుంటుందని భావిస్తున్నారు. దీంతో మరింత ఆర్టీసీకి ఆదాయం పెరిగే అవకాశాలున్నాయి. అధికా రులు కాగజ్‌నగర్‌లో బస్ డిపోతో పాటు బస్సు షెల్టర్ల నిర్మాణం, ఆయా మండలాల్లో బస్సు స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఏడు మండలాల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

సూర్యప్రకాష్, కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో ఆర్టీసి బస్ డిపో ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. బస్ డిపో ఏర్పాటు చేస్తే సిర్పూరు నియోజకవర్గంలోని ఏడు మండలాల వాసులకు ఎంతగానో సౌకర్యం ఉంటుంది. జిల్లా సరిహద్దులోని గ్రామాల ప్రజలకు మహారాష్ట్రకు రాకపోకలకు సాగించేందుకు ఇబ్బందులు తొలగిపోతాయి. ఆర్టీసీకి ఆదాయం కూడా పెరుగనుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

అర్జీదారులు గమనించాలి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టర్ భవన సముదాయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ని జి1-బి, జి1-సి గదులలో నిర్వహించనున్నామని, అర్జీదారులు గమనించాలని శనివారం కలెక్టర్ వెంక టేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ దరఖాస్తులను అందజేయాలని కలెక్టర్ సూచించారు.

రైతులకు అవగాహన

వాంకిడి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని నార్లపూర్ గ్రామం లో శనివారం ఇందాని ఏఈవో శంకర్ కిసాన్ కపాస్ యాప్‌పై రైతులకు అవ గాహన కల్పించారు. యాప్ డౌన్‌లోడ్ చేయడం, స్లాట్ బుక్కింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కిసాన్ కపా స్‌పై ఏమైనా సందేశాలు ఉంటే ఏఈవో లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకా తప్పనిసరిగా వేయించాలి

చింతలమానేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. చింతలమానేపల్లి మండలం బాబాసాగర్ గ్రామంలో శనివారం పశువైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సంద ర్భంగా ఆ యన మాట్లాడుతూ రైతులు తప్పని సరిగా ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు వ్యవసాయంతో పాటు పడి పోషణపై దృష్ట సారించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది కేశవ్, రాజన్న, స్రవంతి, దక్షణమూర్తి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పండరీపూర్‌కు భక్తుల పాదయాత్ర


పండరీపూర్‌కు పాదయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

కెరమెరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏటా కార్తీక పౌర్ణమి సందర్భంగా మహారాష్ట్రలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం పండరీపూర్‌కు చంద్రాపూర్, ఆసిఫాబాద్ జిల్లాల భక్తులు ఆదిలాబాద్ వరకు పాదయాత్ర మొదలు పెట్టారు. ఈ పాదయాత్ర శుక్రవారం ఆసిఫాబాద్‌లోని భాగ్యనగర్ ఎక్స్ రోడ్డు నుంచి ప్రారంభమమై సాయంతరం కెరమెరి మండలం గోయగాం గ్రామానికి చేరుకుంది. అనంతరం శనివారం ఉదయం గ్రామస్థులు పూర్ణకుంబాలు, మంగళహారతులతో పాదయాత్ర బృందాన్ని గ్రామ పొలిమే వరకు వెళ్లి వీడ్కోలు పలికారు. సాయంత్రం పాదయాత్ర బృందం కెరమెరి మండల కేంద్రానికి చేరుకుంది. గ్రామ పటేల్ శంకర్, లక్ష్మణ్, పాండురంగ్, సోనాజీ మహారాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు. పాదయాత్ర బృందానికి రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగి తుకారాం మహారాజ్ నేతృత్వం వహించారు. ఈ నెల 30న ఆదిలాబాద్ నుంచి రైలు ద్వారా పండరీపూర్‌కు చేరుకుంటారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం గోయగాం గ్రామం నుంచి పండరీపూర్ వరకు పాదయాత్ర కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ పాల్గొని పల్లకి మోశారు. ఆయన వెంట దిలీప్, బాలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క స్వైరవిహారం.. ఆరుగురికి గాయాలు


గాయపడిన బాపు

నెన్నెల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. రోడ్డుపై ఎవరు కనడడితే వారిమీద విరుచుకుపడింది. కుక్క దాడిలో ఆరుగురు గాయలపాల య్యారు. చాకలివాడకు చెందిన ఓరగంటి బాపు, ఎస్సీ కాలనీకి చెందిన లేతకారి కుమార్, గంగపుత్ర కాలనీకి చెందిన కంపెల జశ్వంత్, కంపెల రాజేశం, కాపువాడకు చెందిన భీమరాజుల హరీష్, అటకపురం పోషం కుక్క కాటుకు గురయ్యారు. గాయపడ్డ వారికి నెన్నెల పీహెచ్ సీలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుక్కల బెడదతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వీది కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పకడ్బందీగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు

ఆసిఫాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజక వర్గాల్లో భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్‌కుమార్, ఇతర అధికారులతో కలిసి శనివారంవీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ఎన్నికల అధికారులు, ఈఆరోలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. 2002 ఎలక్టోరల్ జాబితాతో నియోజక వర్గాల వారీగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి నాలుగు కేటగిరీలుగా విభవించామని తెలిపారు. ఇందులో కేటగిరిలో 1987 కంటే ముందు జన్మించి 2002, 2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదు కాబడిన వారు కేటగిరి బిలో చేర్చామని అన్నారు. 1987 కంటే ముందు జన్మించి 2002 ఓటరు జాబితాలో లేకుండా 2025 జాబితాలో నమోదు కాబడిన వారు కేటగిరి సీలో ఉంటారని అన్నారు. 1987 నుంచి 2002 మధ్యలో జన్మించిన 2025 ఓటరు జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరి డిలో 2002-2007 మధ్యలో జన్మించిన వారిగా విభజించామని తెలిపారు. అన్ని కేటగిరిలు కలిపి రాష్ట్ర వ్యాప్తంగా 3.33 కోట్ల ఓటర్లను మ్యాపింగ్ చేయడం జరిగిందని తెలిపారు. మొదట మ్యాపింగ్ చేయడిన కేటగిరి ఏ జాబితాను బీఎల్‌ఓ యాప్ ద్వారా నిర్ధారించుకోవాలని అన్నారు. తద్వారా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా పోర్టల్‌లో నమోదు చేయడుతుందని తెలిపారు. అనంతరం కేటగిరి సి, క్యాటగిరి డిలలోని ఓటర్లను కేటగిరి ఏకు మ్యాపింగ్ చేయాలని, ఈ ప్రక్రియను ఏఈఆర్‌ఓల ఆధ్వర్యంలో బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు బీఎల్‌ఓ యాప్ ద్వారా ప్రక్రియ నిర్వహించేలా చూడాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీసీ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజక వర్గాలలో భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. కేటగిరిల వారీగా బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులతో రివిజన్ ప్రక్రియను నిర్వహిస్తామని తెలిపారుపది రోజుల్లోగా కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు సమన్వయంతో కృషి చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఎన్నికల పర్యవేక్షకులు శ్యామ్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

మనస్పర్థలతో భార్యపై కత్తెరతో దాడి

జన్నారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో భార్యపై కత్తులతో దాడి చేసి పొడిచిన సంఘటన మండలంలోని చింతగూడ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చింతగూడ గ్రామానికి చెందిన సూర అనితకు జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన సూర అశోక్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం కాగా వీరికి బాబు పుట్టాడు. దంపతులు ఇటీవల కొంతకాలంగా గొడవలుపడడంతో చింతగూడెంలోని తల్లిగారి ఇంటిలోనే ఉంటుంది. కాగా అశోక్ కొంతకాలంగా దుబాయి వెళ్లివస్తున్నాడు. ఈ క్రమంలో రెండురోజుల క్రితం దుబాయి నుంచి వచ్చిన అశోక్ శనివారం మధ్యాహ్నం చింతగూడెం వచ్చాడు. భార్య అనితతో గొడవపడి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటిలో ఎవరులేని సమయంలో వచ్చి అనితతో మళ్లీ గొడవపడి అందుబాటులో ఉన్న కత్తెరతో మెడ, కడుపులో దాడి చేశాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో బాధితురాలిని లక్షెట్టిపేట ఆసుపత్రికి తరలిం చారు. మెరుగైన చికిత్స కోసం మంచిర్యా లకు తరలించినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్‌ఐ అనూషను వివరణ కోరగా సమాచారం అందిందని తెలిపారు.

కార్మికుల గైర్హాజరుపై దృష్టి

- ఏడాదిలో 150 మస్టర్లు ఉండాలని నిబంధనలు
- యాజమాన్యం చర్యలు

మందమర్రిటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఇక నుంచి ఉద్యోగులు విధులకు తప్పనిసరిగా హాజరయ్యేలా గైర్హాజరు తగ్గించేందుకు యాజమాన్యం కొత్త నిబంధనలు ప్రవేశపెట్టింది. కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం నుంచి ఓ సర్క్యులర్‌ను జారీ చేసింది. అందులో ఏడాదికి 150 మస్టర్లు ఉంటే విధులకు కొనసాగించాలని పేర్కొంది. దీనితో పాటు గతంలో సంవత్సరానికి వంద మస్టర్లు ఉన్నదానికి 150 మస్టర్లకు పొడి గిస్తూ ఈ సర్క్యులర్‌లో పేర్కొంది. గతంలో రెండు నుంచి మూడు సంవత్సరాల వరకు వంద మస్టర్లు ఉంటే వారిని డిస్మిస్ చేయకుండా ఉద్యోగాలు చేసుకునేలా అవకాశం కల్పించే వారు. ఇక నుంచి 150 మస్టర్లు నింపక పోతే వారికి విధులకు తీసుకోవడం కష్టత రమే అని తెలుస్తుంది. కొంత మంది ఉద్యోగులు అనారోగ్యంతో పాటు అకారణంగా విధులకు హాజరవడం లేదని యాజమాన్యం భావిచింది. దీంతో వారు విధులు నిర్వహించి డిస్మిస్ కాకుండాచూసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. సింగరేణిలో ఉత్పత్తి ఉత్పాదకతపై ప్రభావం పడుతుందని సింగరేణి యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గైర్హాజరు మూలంగా ప్రస్తుతం పని చేస్తున్నటువంటి ఉద్యోగుల పై పనిభారం పెరుగుతుందని యాజమాన్యం భావిస్తున్నది. ఎక్కడలేని విధంగా సింగరేణిలో మంచి వేతనాలు ఉన్నందున వ్యక్తి కారణాలతో విధుల వద్ద ఏమైన సమస్య ఉంటే పరిష్కరించాలని యాజమాన్యం భావిస్తోంది. కొన్ని సంవత్సరాలుగా యాజమాన్యం విధులకు గైర్హాజరు అవుతున్నవారికి గనుల, డిపార్టుమెంట్ల వద్ద కౌన్సెలింగ్ కార్యక్రమాలను చేపడుతూ వారు విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటుంది. అయినప్పటికీ చాలా మంది గైర్హాజరు ఉద్యోగుల్లో మార్పు రావడానికి ఈ కొత్త నిబంధన తీసుకొచ్చినట్లు చెబుతున్నారు. ఏడాదికి 150 మస్టర్లు ఉంటేనే వారికి విధుల్లోకి అనుమతిస్తారని తెలుస్తోం ది. ఉద్యోగులు విధులకు హాజరై డిస్మిస్ కాకుండా చూడాలనే ఏకైక లక్ష్యంగా సింగరేణి యాజమాన్యం ముందుకు వెళ్తున్నదని చెబుతున్నారు.

సింగరేణి భవిష్యత్తుపై టీజేఎస్ చర్చ


కోదండరాంను కలిసిన నాయకులు

శ్రీరాంపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో సింగరేణి భవిష్యత్తుపై చర్చించారు. శనివారం ఆయన మంచిర్యాలలో రాష్ట్ర నాయకుడు బాబన్న ఇంట్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింగరేణి ప్రస్తుత పరిస్థితి, ఉపరితల, భూగర్భ గనులు, అసంఘటిత కార్మికవర్గం, రాజకీయ పరిస్థితులు, నిరుద్యోగం, సింగరేణి ఉద్యోగుల మారుపేర్లు, డిస్మిసల్ కార్మికుల సమస్య పరిష్కారంపై పోరాటం గురించి వారు మాట్లాడారు. అలాగే తెలంగాణ జన సమితి పార్టీ, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం యూనియన్ నిర్మాణం గురించి చర్చించారు. కార్యక్రమంలో టీజేఎస్ రామచంద్రారెడ్డి, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడ సమ్ము రాజయ్య, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజన్న, నాయకుడు సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న జీఎం రాధాక్రిష్ణ

మందమర్రిటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజ మాన్యం ఆధ్వర్యంలో ఆదివారం బెల్లంపల్లి ఎఎంసీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మందమర్రి జీఎం రాధాక్రిష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 75 కంపెనీలు హాజరవుతున్నా యని, ఏడో తరగతి నుంచి మొదలు కొని పీజీ వరకు చదివిన వారికి ఉపాది అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ

మందమర్రిటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మొక్కలతోనే మానవాళికి మనుగడ అని మొక్కలను పరిరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని జీఎం రాధాకృష్ణ అన్నారు. శనివారం స్థానిక సింగరేణి పాఠశాలను ఆయన సందర్శించి మైదానంలో మొక్కలు నాటి నీరు పోశారు. కొత్తగూడెం పాఠశాల సెక్రెటరీ వెంకటచారి, ఎస్‌వోటూ జీఎం విజయ్ ప్రసాద్, పీఎం శ్యాం సుందర్, రక్షణాధికారి భూశంకరయ్య, ఫారెస్టు ఆఫీసర్ నవీన్, అధికా రులు నవనీత, ఆసిఫ్, వెంకట్‌రెడ్డి, హెడ్‌మాస్టర్ పురుషోత్తం పాల్గొన్నారు.

తల్లీకూతుళ్లకు కన్నీటి వీడ్కోలు



పొలాల్లో నుంచి స్పందన మృతదేహాన్ని తీసుకెళ్తున్న బంధువులు

జన్నారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేండ్లగూడ గ్రామంలో ఆత్మహత్యకు పాల్పడ్డ స్పందన, ఆమె కూతురి అంత్యక్రియలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బంధువులు అశ్రునయనాల మధ్య వీడ్కోలు పలికారు. సంప్రదాయం ప్రకారం వారి పొలంలోనే ఖననం చేశారు. ఈ సందర్భంగా అంతిమ యాత్ర పొలాల వెంబడి కష్టపడుతూ తీసుకెళ్తున్న దృశ్యాలు బంధువులను కంటతడి పెట్టించాయి.

ఆర్థిక సాయం

దండేపల్లి అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త నలిగంటి రాజయ్య తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అనుచరుడైన రాజయ్యకు ఎమ్మెల్యే రూ. 10వేల ఆర్థిక సాయం పంపించారు. శనివారం రాజయ్య కుటుంబసభ్యులను కాంగ్రెస్ నాయకులు పరామర్శించి నగదును ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి అందజేశారు. మాజీసర్పంచు ఎల్లెపు శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అరెపల్లి రమేష్, గ్రామ కమిటి అధ్యక్షుడు గొట్ల మహేందర్, నాయకులు కంది శంకర్, గెళ్ళ శ్రీనివాస్, కొప్పుల రవికిరణ్, జులపెద్ది రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మందమర్రిరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిగట్టు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మాజీ సర్పంచు కోట రాయలింగు శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరు మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచు సత్తయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో కార్డెన్ సెర్చ్

మంచిర్యాల క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని హమాలివాడలో పోలీసులు శనివారం రాత్రి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ స సందర్భంగా డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ సంఘవిద్రోహ చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరైన పత్రాలు లేని పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు, సీఐ రమణమూర్తి, ఎస్‌లు తిరుపతి, సత్తన్న ఉన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం

- అధ్వానంగా మురికి కాలువలు
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- సమస్యలతో ప్రజలు సతమతం



బెల్లంపల్లిలోని కాల్‌టెక్స్ ఏరియాలో రహదారి పక్కన ఉన్న చెత్త కుప్పలు

బెల్లంపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యం లోపించి అస్తవ్యస్తంగా మారుతోంది. బెల్లంపల్లి మున్సి పాలిటి అయినప్పటికీ డంపింగ్‌యార్డు లేకపోవడంతో ఎక్కడికక్కడే చెత్త పేరుకపోతోంది. ఎప్పటినుంచో మున్సిపాలిటీలో డంపింగ్ యార్డు సమస్య వేధిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్థలాలు చూడడమే తప్ప డంపింగ్ యార్డు ఏర్పాటు చేయలేదు. దీంతో పట్టణంలోని పలు వార్డుల్లో ట్రాలీల ద్వారా మున్సిపల్ కార్మికులు చెత్త సేకరించి రహదారుల పక్కన డంప్ చేస్తుండడంతో దుర్గంధం వెదజల్లు తోంది. ఈగలు, దోమలు వ్యాప్తిచెందుతూ ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పట్టణంలో ఏ వార్డుకు వెళ్లినా చెత్త కుప్పలే దర్శనమిస్తుండడంతో పారిశుధ్యం సరిగ్గా చేపట్టడం లేదని మున్సిపల్ అధికారులపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛతకు దూరంగా మున్సిపాలిటీ...

పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతుండడంతో మున్సిపాలిటీ స్వచ్ఛతకు దూరంగా ఉంటోంది. ప్రధాన రహదారుల పక్కన సమీప వీధుల దగ్గర చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పట్టణంలో మొత్తం 34 వార్డులు ఉన్నాయి. మున్సిపాలిటీ సిబ్బంది. వాహనాల ద్వారా వారంలో రెండు మూడురోజులకు ఒకసారి చెత్త సేకరిస్తున్నారు. సేక రించిన చెత్తను రహదారుల పక్కన ఎక్కడపడితే అక్కడ డంప్ చేస్తున్నారు. 34 వార్డుల్లో ప్రతీరోజు చెత్త సేకరిం చేం దుకు సరిపోయే ట్రాలీలు, సిబ్బంది లేకపోవడం సైతం పారి శుధ్య నిర్వహణకు కష్టమవుతోంది. పలు వార్డుల్లోని డ్రైనేజీలు చెత్త చెదారంతో నిండిపోయి మురుగునీరు డ్రైనేజీల నుంచి వెళ్లకుండా ఇళ్ల సమీపంలోకి రహదారుల వెంబడి ప్రవహిస్తోంది.



రైల్వే స్టేషన్ ఏరియాలో నిండిన డ్రైనేజీ, కాంట్రాక్టర్ బస్తీలో ఇళ్ల సమీపంలో ఉన్న మురుగునీరు

డంపింగ్ యార్డు కరువు...

పట్టణంలోని వార్డుల్లో ట్రాలీల ద్వారా సేకరించిన చెత్తను మున్సిపల్ సిబ్బందికి ఎక్కడ డంప్ చేయాలో తెలియని దుస్థితి నెలకొంటుంది. మూడేళ్ల క్రితం కోటి రూపాయలకుపైగా నిధులతో పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో డంపింగ్‌యార్డు పూర్తి చేసినప్పటికీ అదే ప్రాంతంలో ఫుడ్‌జోన్ ఏర్పాటు చేయడంతో డంపింగ్ యార్డును తీసివేశారు. దీంతో కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులు వృధా అయ్యాయి. అప్పటినుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయకపోవడంతో పట్టణంలోని చెత్తను ఎక్కడపడితేఅక్కడ డంప్ చేస్తున్నారు. దీంతో ప్రజలు అనారోగ్యం భారిన పడుతున్నామని పలుమార్లు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నాలు చేపట్టారు. దీంతో సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు డంపింగ్‌యార్డు కోసం పలు ప్రాంతాల్లో స్థలాలు చూశారే తప్ప నేటికీ ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ఇప్పటికైనా మున్సిపాలిటిలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి పారిశుధ్య నిర్వహణ పై చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు...

శ్రీనివాస్, బెల్లంపల్లి



మాది పట్టణంలోని కాంట్రాక్టు బస్తీ.. డ్రైనేజీలు నిండిపోయి ఇళ్లలోకి నీరు చేరుతుంది. అలాగే ఎక్కడ చూసిన చెత్తకుప్పలు ఉంటున్నాయి. పారిశుధ్య నిర్వహణపై అధికారులకు ఎన్నిమార్లు విన్నవించుకుంటున్న సమస్య పరిష్కరించడం లేదు. పారిశుధ్యం సక్రమంగా లేకపోవడంతో వార్డు ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. సంబంధిత అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి.

పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలి..

రాజేశ్, బెల్లంపల్లి



పట్టణంలో పారిశుధ్య నిర్వహణ సంబంధిత అధికారులు సక్రమంగా చేప ట్టాలి. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. దీంతో రహదారుల వెంబడి వెళ్లాలం టే ముక్కుమూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. రహదారుల పక్కన చెత్తకుప్పలు వేయడంతో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమలు, ఈగలు వృద్ధి రోగాలకు కారణమవుతున్నాయి.

సూపరింటెండెంట్ ఇంజనీర్ కిరీటి సేవలు చిరస్మరణీయం



వృద్దులకు స్వెటర్లు అందజేస్తున్న ఎస్టీపీపీ అధికారులు

జైపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దివంగత ఎస్టీపీపీ సూపరింటెండెంట్ ఇంజనీర్ కిరిటీ సేవలు చిరస్మరణీయమని ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం నరసింహారావులు అన్నారు. కిరీటి జయంతి వేడుకలను శనివారం సీసీసీలోని సాయి అనాథ వృద్ధాశ్రమంలో ఎస్టీపీపీ అధికారులు ఘనంగా నిర్వహించారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం నరసింహారావులు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. వృద్దులకు పండ్లు, స్వెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిరిటీ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఇలాంటి సహాయ సహకారాల్లో మన వెన్నంటే ఉంటారన్నారు. కార్యక్రమంలో అధికారులు మదన్‌మోహన్, పంతుల, వీరబ్రహ్మం, రాకేష్, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

మందమర్రిరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను వేగంగా నిర్మించుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని పులిమడుగులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు దశల వారీగా బిల్లులు వస్తాయని లబ్ధిదారులకు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువుల సంచారం

- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు



రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

మందమర్రిరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మందమర్రిలోని అందుగులపేట నుంచి బొక్కలగుట్ట వరకు జాతీయ రహదారిపై పశువులు సంచరిస్తుండడంతో ప్రయాణీకులు ప్రమాదాల బారిన పడే అవకాశాలున్నాయి. జాతీయ రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. కానీ బొక్కలగుట్టలోని గాంధారి వనం సమీపంలో రోడ్లపైన పశువులు పడుకుని ఉండడం, గుంపులు గుంపులుగా రోడ్డుకు అడ్డంగా ఉండడంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వెళ్తున్నారు. ద్విచక్రవాహనదారులు పలుమార్లు పశువులను ఢీకొని ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి. ముఖ్యంగా అందుగుల పేట, పులిమడుగు, బొక్కలగుట్ట లోని నాలుగు వరుసల రహదారిపై నిత్యం పశువులు సంచరిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రహదారిపైకి పశువులు రాకుండా చర్యలు తీసుకోవాలని, పశువుల యాజమానులకు తగు సూచనలు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డుపైకి చెట్లు.. ఇబ్బందుల్లో ప్రజలు



సీసీ రోడ్డుపైకి వచ్చిన పిచ్చి మొక్కలు

కన్నెపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్‌పల్లి గ్రామపంచాయతీలోని ఎస్సీ కాలనీ (హరిజనవాడ)లోని సీసీ రోడ్డు పైకి పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు వచ్చాయి. దీంతో వాహనాలు వెళ్తున్నప్పుడు చెట్లు తగిలి వాహనదారులు కింద పడుతున్నారు. రోడ్డు పక్కన రెండు వైపులా చెట్లు ఉండడంతో పాములు వస్తున్నాయని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపైకి వచ్చిన చెట్లతో పాటు రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లను తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

వైభవంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

దండేపల్లి అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి శనివారం పురస్కరించుకుని దండేపల్లి మండలం సత్యనారాయణస్వామి దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచి వందలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి నదిలో కార్తీక దీపాలు వదిలారు. అనంతరం ఆలయానికి చేరుకొని సత్యదేవున్ని దర్శించుకొని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు కుటుంబసమేతంగా స్వామి వారి వ్రతాలను ఆచరించారు.

పెద్దపల్లి జిల్లాలో రోడ్డుప్రమాదం..

- మందమర్రికి చెందిన మహిళ మృతి

సుల్తానాబాద్/మందమర్రిటౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సయ్యపల్లి గ్రామ స్టేజీ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మోయ లావణ్య(43) మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన లావణ్య తల్లి స్వగ్రామం ఎలిగేడు మండలం బుర్హాన్‌మియాపేటకు వచ్చింది. తల్లి అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా రోజు ఆహారం తీసుకు వెళుతుండేది. శనివారం రాత్రి కూడా భోజనం తీసుకువెళ్లేందుకు సుల్తానాబాద్ మండలం నర్సయ్యపల్లి స్టేజీ వద్దకు వచ్చింది. కరీంనగర్ వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో పెద్దపల్లి నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న కారు వేగంగా ఢీ కొట్టడంతో లావణ్య అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రావణ్ కుమార్, పోలీస్ సిబ్బంది వివరాలు సేకరించి, మృతదేహాన్ని సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలించారు. కాగా లావణ్య మందమర్రి మున్సిపాలిటీలో ఆర్పీగా పనిచేస్తుండేది.

ఉపాధిహామీ పనులను వేగంగా పూర్తి చేయాలి

మందమర్రిరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేశ్వర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాటా్డుతూ గ్రామాల్లో జరుగుతున్న పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ సమావేశం

చెన్నూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం 15వ సాధారణ సోషల్ ఆడిట్ కో ఆర్డినేటర్ సమావేశాన్ని నిర్వహించారు. అలాగే పంచాయతీరాజ్ డైరెక్టర్ నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కూడా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాపంచాయతీఅధికారి వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్‌అలీ, ఏపీవో గంగాభవాని, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

రైతులు సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి సురేఖ

కాసిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు శాస్త్రసాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకుని వ్యవసాయం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి సురేఖ అన్నారు. మండలంలోని సంద్రల్‌పాడ్‌లో బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి సాగు పద్ధతులపై క్షేత్ర దినోత్సవం కార్యక్రమానికి శనివారం హాజరై మాట్లాడారు. జిల్లా రైతులు వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు అధిక సాంద్రత పత్తి సాగు సాంకేతికతను అవలంభించాలని సూచించారు. కిసాన్ కపాస్ యాప్ గురించి అవగాహన కల్పించారు. ఈ యాప్ ద్వారా పత్తిని సులభతరంగా సీసీఐలో అమ్ముకోవచ్చన్నారు. రైతులందరు యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పత్తి అమ్మిన తర్వాత డబ్బులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. దీంతో దళారి వ్యవస్థ నిర్మూలించడం సాధ్యమవుతుందన్నారు.

అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మహేష్ మాట్లాడుతూ అధిక సాంద్రత పత్తి సాగు సాంకేతికత ద్వారా అధికదిగుబడులు పెరగడమే కాకుండా నేల సారాన్ని కాపాడుకోవచ్చని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ నాగరాజు, ఆత్మచైర్మన్ రౌతు సత్తయ్య, బెల్లంపల్లి ఏడీఏ రాజనరేందర్, కాసిపేట ఏఈవో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సురేఖ

వేధిస్తున్న కూలీల కొరత

(5వ పేజీ తరువాయి)



నెన్నెలకు చేరుకున్న మహారాష్ట్ర కూలీలు

పత్తి ఏరడానికి వెళ్తారు. ఒక్కొక్కరు. 80 నుంచి 110 కిలోల పత్తి వరకు సేకరిస్తారు. దీంతో ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల నుంచి 1,200 రూపాయల వరకు గిట్టుబాటవుతుంది. తమ వద్ద పనులు లేక పిల్లా పాపలతో వలస వచ్చామని వారు చెప్పారు. ఇళ్లు గడవక పొట్టచేత పట్టుకొని వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఇక్కడికి వచ్చామని తెలిపారు. మూడు నెలలు పని లభిస్తుందని ఒక్కొక్కరు 30 వేల రూపాయల నుంచి 40 వేల రూపాయల వరకు సంపాదించుకొని ఇంటికి తీసుకెళ్తామని చెబుతున్నారు.

- వేతనం..ఒప్పందం ప్రకారమే..

స్థానిక కూలీలు క్వింటాలు పత్తి సేకరణకు వెయ్యి రూపాయలు తీసుకుంటున్నారు. మొదటి దఫాకే క్వింటాలుకు వెయ్యి రూపాయలు చెల్లిస్తే... 2, 3వ విడతలకు మరింత పెంచుతారని రైతులంటున్నారు. వలస కూలీలు సీజన్ మొదటి నుంచి ఆఖరు వరకు ఒకే ధర తీసుకుంటారు. పత్తి ఎక్కువ తక్కువలున్నప్పటికీ సేకరణకు కిలోకు 10 రూపాయల చొప్పున ఒప్పందం కుదుర్చుకొని వచ్చారు. పత్తిని ట్రాక్టర్‌లో ఇంటికి చేర్చడం, ఇంటి వద్ద నిల్వ చేయడం కూడా వారే చేస్తారు. కూలీలను వాహనాల్లో చేలకు తీసుకెళ్లడం, తిరిగి ఇంటివద్ద రైతులే దిగబెట్టాల్సి ఉంటుంది.

- ఊపందుకుంటున్న సేకరణ పనులు

జిల్లాలో ఏటా అక్టోబరు మొదటి వారం నుంచే పత్తి ఏరడం ప్రారంభిస్తారు. ఈసారి ఇప్పటి వరకు వర్షాలు కురుస్తుండటంతో చెట్లు పచ్చగానే ఉండి పత్తి కాయలు త్వరగా పగల లేదు. మొదట కాసిన కాయలు మాత్రమే దూదిగా మారాయి. ఈపాటికి రెండో విడత పత్తి సేరించాల్సి ఉండగా ఇప్పుడిప్పుడే ప్రారంభిస్తున్నా రు. ప్రస్తుతం చలి తీవ్రత పెరిగి పగటి పూట ఎండలు కాస్తుండటంతో మరో వారం పదిరోజుల్లో పత్తి సేకరణ ఊపందుకోనుంది. పూర్తిస్థాయిలో కాయలు పగిలితే కూలీలకు చేతినిండా పని లభిస్తుంది. జనవరి ఆఖరు వరకు ఈసీజన్ కొనసాగుతుందని అంటున్నారు.

పోషకాహార లోప నివారణకు గుప్పెడు పప్పు

(5వ పేజీ తరువాయి)



దేవాపూర్‌లో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఐకేపీ అధికారులు

అధికారులు గుర్తించారు. ముఖ్యంగా గ్రామీణ గిరిజన ప్రాంతాల్లోనే. వీరు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

- మహిళా సంఘాలకు అవగాహన సదస్సు

కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రతిష్టాత్మకంగా భావించి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే స్వయం సహాయక సంఘాలతోపాటు గ్రామైక్య సంఘాల్లోని లీడర్లకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని చిన్నారులందరికి పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా పెట్టుకుని గ్రామైక్య సంఘాలకు సగటున ఇద్దరు పిల్లలను దత్తత తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఐదేళ్ల పిల్లలకు ఎనిమిదేళ్లు వచ్చేంత వరకు గ్రామైక్య సంఘం పూర్తి బాధ్యత వహించి ఆ పిల్లలను ఆరోగ్యవంతులగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తుంది. క్షేత్రస్థాయిలో మహిళలు ఇంటి నుంచి గుప్పెడు పప్పు, పాలు, గుడ్లు, ఆకుకూరలు, బియ్యం తీసుకురావడంతో ఆరోగ్యకరమైన సమాజం నిర్మితం అవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం

- గోగు స్వర్ణలత, డీపీఎం (హెచ్‌డీ), మంచిర్యాల



పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించిన అనంతరం వారికి స్వయం సహాయక సంఘం సభ్యుల నుంచి ఇంట్లో ఉన్న గుప్పెడు పప్పు, బియ్యం, పండ్లు, గుడ్లు, కూరగాయలు లాంటివి గ్రామైక్య సంఘానికి తీసుకురావాలని సభ్యులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ప్రతి సభ్యురాలు బాధ్యతతగా స్వచ్ఛందంగా పాల్గొని మెరుగైన ఆరోగ్య నిర్మాణంలో భాగస్వాములను చేసేందుకు మహిళలను చైతన్య పరుస్తున్నాం. మహిళలు సంఘటితంగా ఉండి దీన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

- కిషన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి



పోషకాహార లోపంతో బాధపడుతన్న పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. గ్రామీణ ప్రాంతఱల్లోని నిరుపేద పిల్లల్లో పౌష్టికాహారం లోపించడంతో శారీరక, మానసిక ఎదుగుదల లేక పిల్లలు వ్యాధులు బారిన పడుతుంటారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గ్రామైక్య సంఘాలు దత్తత తీసుకుని మంచి పౌష్టికాహారం అందించేందుకు కృషి చేస్తున్నారు. మెరుగైన ఆరోగ్య సమాజ నిర్మాణంలో అందరు భాగస్వాములు కావాలి.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



కవిత (ఫైల్)

మందమర్రిరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మండలంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బెల్లంపల్లికి చెందిన ఉప్పట్ల కవిత మృతిచెందారు. రామకృష్ణపూర్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... సుభాష్ అతని భార్య కవిత, కూతురు భార్గవి ముగ్గురు స్కూటీపై బెల్లంపల్లిలోని బంధువుల పెళ్లికి శుక్రవారం వెళ్లారు. తిరిగి మంచిర్యాలకు వస్తుండగా రాత్రి బొక్కలగుట్ట వద్ద సర్వీసు రోడ్డులో వెళ్తున్న స్కూటీని అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు వెనక నుంచి ఢీకొట్టడంతో కవిత భర్త, కూతురు ఎగిరిపడగా స్వల్పగాయాలయ్యాయి. కవిత బస్సు కింద పడడంతో బస్సు కొంత దూరం ఈడ్చుకుపోయింది. దీంతో కవితకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. కవిత భర్త సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఏసీబీకి చిక్కిన జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్
- రూ. 2 లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టివేత
6

వేధిస్తున్న కూలీల కొరత

- ఏక కాలంలో చేతికి వస్తున్న పత్తి, వరి పంట
- కూలీల కోసం పొరుగు రాష్ట్రాలకు పరుగు
- జిల్లాకు చేరుకుంటున్న వలస కూలీలు



పత్తి సేకరిస్తున్న వలస కూలీలు

నెన్నెల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కూలీల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. పత్తి సేకరణకు కూలీలు దొరకడం లేదు. జిల్లాలో వరి కోతలు...పత్తి ఏరడం ఏకకాలంలో మొదలయ్యాయి. దీంతో కూలీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీనికి తోడు రైతు లను వర్షం భయం వెంటాడుతోంది. పత్తి తడిసి దెబ్బ తినక ముందే సేకరించుకునేందుకు రైతులు తొందర పడుతున్నారు. స్థానిక లేబర్ సరిపోక కూలీల కోసం రైతులు పొరుగు రాష్ట్రాలకు పరుగులు పెడుతున్నారు. వ్యయ ప్రయస లకోర్చి ఇతర రాష్ట్రాల కూలీలను తీసుకువస్తున్నారు. బ్రోకర్ల సాయంతో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యాణా, ఢిల్లీ ప్రాంత కూలీలు ప్రత్యేక వాహనాల్లో జిల్లాకు పెద్ద ఎత్తున చేరు కుంటున్నారు.



పత్తి మూటలను ట్రాక్టర్‌లో ఇంటికి చేరుస్తున్న కూలీలు

రైతులే ఖర్చులు భరించి...

కూలీల డిమాండ్ దృష్ట్య చేసేదేంలేక రైతులు ఖర్చులన్ని భరించి వలస కూలీలను తీసుకొస్తున్నారు. ఇతర రాష్ట్రాల కూలీలకు, రైతుకు మధ్యవర్తిత్వం వహించే బ్రోకర్‌కు కమీషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో జట్టుకు నాలుగు వేల రూపాయల నుంచి ఆరు వేల రూపాయల వరకు బ్రోకర్ తీసుకుంటున్నాడు. ఇతర రాష్ట్రాల నుంచి కూలీల కుటుంబాలు ఇక్కడికి ప్రత్యే క వాహనంలో చేరుకుంటాయి. వాహనం కిరాయి రైతే భరించాల్సి వస్తోంది. దూరాన్ని బట్టి పదివేల రూపయాల నుంచి 15 వేల రూపాయల వరకు వాహనానికి కిరాయి ఉంది. ఉత్తర భారతదేశం నుంచి వచ్చే వారికి ముందస్తు ట్రైన్ టికెట్లు బుక్ చేస్తున్నారు. పిల్లాపాపలతో ఇక్కడికి చేరుకున్న కూలీలకు బస ఏర్పాటు చేయాల్సి వస్తోంది. గుడారాల ఏర్పాటు, వంట చెరుకులు, కరెంటు, నీటి సౌకర్యాన్ని రైతులే కల్పిస్తున్నారు.

కూలీలకు ఉపాధి.. రైతులకు ఊరట

జిల్లాకు ప్రతీ సీజన్‌లో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, హర్యాణా, ఢిల్లీ ప్రాంతాలకు చెందిన వలస కూలీలు వస్తారు. వారికి మూడు నెలలు ఉపాధి లభించడంతో పాటు ఇక్కడి రైతులకు కూలీల కొరత తీరుతుంది. వలస వచ్చిన కూలీల కుటుంబాలు గ్రామ శివార్లలో, పెరళ్లలో బస ఏర్పాటు చేసుకొని సూర్యోద యానికి పూర్వమే చేలల్లో..
(మిగతా 7లో)

బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలి



గాంధీ విగ్రహం ఎదుట దీక్షలో కూర్చున్న బీసీ సంఘం నాయకులు

మంచిర్యాల క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ సంఘం నాయకులు డిమాండ్ చేస్తూ మంచిర్యాల పట్టణం గాంధీ విగ్రహం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం బీసీల న్యాయమైన డిమాండ్, బీసీ ఆకాంక్షలు, బీసీల ప్రజాస్వామిక వాటాపై ఉద్యమాలు ప్రదర్శిస్తున్నప్పటికి కేంద్రం అధికారంలో ఉన్నా పెడచెవిన పెట్టడం బాధాకరమన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం 42 శాతం అమలుచేయని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు శ్రీనివాస్, కర్ర శ్రీధర్, గజ్జెల వెంకయ్య, సుదర్శన్, శెట్టిపల్లి లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏ4 మద్యం దుకాణాల కేటాయింపు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీ విధానం 2025-27లో భాగంగా ఈ నెల 27న ఉదయం 10 గంటలకు నస్పూర్ మండలం శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో గల పీవీఆర్ గార్డెన్స్‌లో ఏ4 మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ నిర్వహిస్తున్నామని జిల్లా ఆబ్కారీ మద్యనిషేధ శాఖ అధికారి నందగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

విశ్వ కర్మ మహాసభ కమిటీలో నస్పూర్ నేతలకు చోటు



సన్మానం చేస్తున్న నాయకులు

నస్పూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా కర్ణకంటి నర్సింహా చారి (నస్పూర్), జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తెలుకుంట్ల రాజాచారి (నస్పూర్)ను నియమించారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు కాలే జగన్నాథం ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు శ్రీరాముల గంగాధర్, మునిగంటి శ్రీనివాస్‌చారిల సమక్షంలో నియమాక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన నర్సింహాచారి, రాజా చారిలు మాట్లాడుతూ విశ్వ బ్రహ్మణుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కాలే అభిషేక్, జగదీశ్వరాచారి, వీర బ్రహ్మచారి, లక్ష్మణాచారి, విజయదుర్గ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావాలి

- డీసీపీ భాస్కర్



రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాల క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ఉన్నది ప్రజల రక్షణ కోసమేనని, రక్తదానంతో ప్రాణదాతలు కావాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలీసులు ప్రజారక్షణ కోసమే ఉన్నారన్నారు. ప్రజల భద్రత కోసం విధినిర్వహణలో అమరులైన వారిని స్మరించుకున్నారు. కుల, మత బేధం లేకుండా నిస్వార్థమైన సేవలు అందించడమే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అన్ని దానాలకన్నా రక్తదానం గొప్పదని, రక్తదానంతో పలువురికి ప్రాణదాతలు కావాలని సూచించారు. వివిధ రంగాల నుంచి రక్తదానానికి వచ్చిన ఆటో డ్రైవర్లను, జర్నలిస్టులు, రక్తదానం చేసిన ప్రతీఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శిబిరంలో 172 యూనిట్లు సేకరించి రక్తాన్ని అందించడం ఎంతో ఆనందం కలిగించిందని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్, సీఐలు ప్రమోద్‌రావు, నరేష్ కుమార్, రమణమూర్తి, సత్యనారాయణ, రెడ్ క్రాస్‌సొసైటీ సభ్యులు సత్యపాల్‌రెడ్డి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

కాసిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమగూడెం ట్యాంకు బస్తీకి చెందిన నిరుపేద ఒంటరి మహిళ చెన్నూరి చిన్నక్కకు చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు శనివారం నిత్యావసరుకులు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు ఆడెపు రవీందర్ మాట్లాడుతూ చిన్నక్క కొడుకు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడని, దీంతో రోజు గడవడం కష్టంగా ఉందని తెలియడంతో నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందించామన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి అంకం రాయమల్లు, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌నాయక్, సభ్యులు కిష్టయ్య, కిషన్, సిద్దార్థ, ఆంజనేయులు, గణేష్ పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న చేయూత సంస్థ సభ్యులు

క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి

మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సూచించారు. శనివారం పట్టణంలోని తిలక్ స్టేడియంలో బీఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు సబ్బని అరుణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. నేటి యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో క్రీడా కోటాలో ఉద్యోగాలు సైతం ఉంటాయని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని క్రీడాస్ఫూర్తితో మెదలాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బత్తుల సుదర్శన్, నాయకులు అలీ, పాల్గొన్నారు.

పొరపాట్లు లేకుండా 'ఎస్ఐఆర్' చేయాలి

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పెషల్ ఇంటన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)ను పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. హైద్రాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో శనివారం సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ జాబితాతో నియోజకవర్గాల వారీగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి నాలుగు కేటగిరిలుగా విభజించామన్నారు. మొదట మ్యాపింగ్ చేసిన కేటగిరి ఏ జాబితాను బీఎల్‌వో యాప్ ద్వారా నిర్ధారించుకోవాలన్నారు. అనంతరం కేటగిరి సీ, డీలలోని ఓటర్లను కేటగిరి ఏకు మ్యాపింగ్ చేయాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ చంద్రకళ, ఆర్డీవో శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

భూ రికార్డులను డిజిటలైజ్ చేయాలి

సర్వేలో భూ రికార్డులను డిజిటలైజ్ చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అధికారులు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా కాడస్ట్రాల్ మ్యాప్‌లను నిర్వహించాలన్నారు. లైసెన్స్ సర్వేయర్ మొదట ప్రభుత్వ భూమిని సర్వే చేస్తారని తెలిపారు. ఇనాం, అసైన్డ్, లావుని పట్టా ఇతర ప్రభుత్వ భూములను నిర్ధారించాలని, అటవీ భూములను సర్వే నుంచి మినహాయించాలన్నారు. ఆరు మండలాల్లో పైలెట్ సర్వే, తొమ్మిది మండలాల్లో తొమ్మిది మంది ప్రభుత్వ సర్వేయర్లు, ప్రతీ మండలంలో లైసెన్స్ పొందిన సర్వేయర్లు ఆరు మంది సభ్యుల బృందం గ్రామాల్లో కచ్చితమైన సర్వేచేయాలని తెలిపారు.

అనాధికార నిర్మాణాలు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలని సూచించారు. అదనపు కలెక్టర్ చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ల్యాండ్ సర్వే అధికారి శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాతో ఉద్యోగ అవకాశాలు

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏఎంసీ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగాల కోసం హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ యువత కోసం ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో జాబ్‌మేళా నిర్వహిస్తుందన్నారు. ఈ జాబ్‌మేళాలలో దాదాపు 75 కంపెనీలకు పైగా పాల్గొంటాయని నాలుగువేలకు పైగా ఉద్యోగాలు ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు బయోడెటాతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు తమ వెంట తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మనోజ్, జీఎం రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తాండూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా తాండూర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కిరణ్‌కుమార్ విద్యార్థులకు పోలీసు లాకప్, ఎఫ్ఐఆర్ రిజిస్ట్రేషన్, సీసీ కెమెరాల పనితీరు, పోలీసు శాఖ పనితీరు, డయల్ 100 సేవలు, ఫింగర్‌ప్రింట్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిత్యం కృషి చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్య



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ వాణి

లక్షెట్టిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మంచి పౌష్టికాహారంతో పాటు ప్రీ ప్రైమరీ విద్య అందిస్తామని లక్షెట్టిపేట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి అన్నారు. లక్షెట్టిపేట మండలం కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన ఈసీసీఈ డే సందర్భంగా గర్భిణులతో పాటు చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారుల బాగోగులు చూసుకుంటూ ఇప్పటి నుంచే నర్సరీ, ఎల్‌కేజీ విద్యకు దగ్గట్టుగా ఆక్టివిటీస్ కూడా అందించడం జరుగుతుందన్నారు. చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను నేర్పేంచేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురా లు సునీత, అంగన్‌వాడీ టీచర్ తిరుమల తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. నేలవాలిన వరి పంట



మామిడిపల్లి శివారులో నేలవాలిన వరి పంటను చూపిస్తున్న రైతు సురేందర్

దండేపల్లి అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం సాయంత్రం ఉరుములతో కూడిన కురిసిన అకాల వర్షంతో రైతన్నలకు ఆపార నష్టం వాటిల్లింది. ఒక్క వైపు వరి పంట కోత దశకు రాగా వర్షంతో కొంత మేర దెబ్బతిన్నది. రాత్రి వరకుతి వర్షం కురువడంతో కొత్త మామిడిపల్లి గ్రామంతో పాటు పలు గ్రామాల్లోని రైతులు సాగు చేసిన వరిపంట నేలవాలడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

పోషకాహార లోప నివారణకు 'గుప్పెడు పప్పు'

- స్వయం సహాయక సంఘాల చేయూత - సగటున ఇద్దరిని దత్తత తీసుకుంటున్న గ్రామైక్య సంఘాలు

కాసిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం మహిళా సంఘాలను భాగస్వామ్యం చేసుకుంటూ గుప్పెడు పప్పు కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ఈ ఏడాది అక్టోబరు మొదటి వారం నుంచి ప్రారంభమైన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామీణ అభివృద్ధి సంస్థతో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా సంక్షేమ శాఖలు కలిసి సమర్థవంతంగా పనిచేసేందుకు కసరత్తు చేస్తున్నాయి. భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన సమాజంతో పాటు పిల్లలకు ఆరోగ్యవంతమైన బాల్యాన్ని అందించేందుకు గుప్పెడు పప్పు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది.

అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికి గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛంద పోషకాహార వస్తువుల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లా సమాఖ్యలో 468 గ్రామైక్య సంఘాలుండగా 10,286 స్వయం సహాయక సంఘాలున్నాయి. ఇందులో 1,10,810 మంది సభ్యులు ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో



పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న ఇద్దరు పిల్లలను గ్రామైక్య సంఘాలు దత్తత తీసుకుంటున్నాయి. స్వయం సహాయక సంఘంలోని సభ్యులు వారికి తోచిన విధంగా పిల్లల కోసం ఇంటి నుంచి గుప్పెడు పప్పుతో పాటు బియ్యం, కూరగాయలు, పాలు, గుడ్లు, ఆకుకూరలు, ఇతరత్రా వస్తువులు ఇవ్వాలనుకునే సభ్యులు గ్రామైక్య సంఘం సమావేశంలో అందజేయాల్సి ఉంటుంది. వీటిని సంఘం సభ్యులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల తల్లిదండ్రులకు అప్పగించారు. పేదరికం కారణంగా సరైన పోషకాహారం అందక ఎదుగుదల లేని పిల్లలకు పౌష్టికాహారం అందే విధంగా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

- పిల్లలను గుర్తించడం ఇలా...

జిల్లాలో 974 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 20,335 మంది ఉండగా, మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలు 8,989 మంది ఉన్నారు. పేదరికం వల్ల పిల్లలకు సరైన పోషకాహారం అందక వ్యాధి నిరోధక శక్తి లోపించడం వల్ల ఎదుగుదలను కోల్పోతున్నారు. ఉండాల్సిన బరువు కంటే తక్కువగా ఉంటున్నారు. సరైన ఎత్తు కూడా పెరగడం లేదు. ఇలాంటి వారిని జిల్లా సంక్షేమ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నివేదికల ద్వారా గుర్తిస్తారు. ఇప్పటి వరకు గ్రామాల్లో పోషకాహార లోపంతో ఐదేళ్ల లోపు చిన్నారులు 342 మంది ఉన్నట్లు..
(మిగతా 7లో..)